తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
24 మే 2026
పేజీలు : 08
Follow :

# శేరిలింగంపల్లి అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

## పెండింగ్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సమీక్ష సమావేశం
- అధికారులు ప్రజల మధ్య వారధిగా వ్యవహరించాలి
- చెరువుల సుందరీకరణ, రోడ్లు, పార్కులపై ప్రత్యేక దృష్టి
- ఇండ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు వేగవంతం చేయాలి



**శేరిలింగంపల్లి, మే 23 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రత్యేక కార్యాచరణతో త్వరితగతిన పరిష్కరించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయా ఉప కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శేరిలింగంపల్లి, మియాపూర్ సర్కిళ్ల పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలు మరియు అభివృద్ధి పనులపై సమగ్ర చర్చ జరిపి, ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.
ప్రజలకు ప్రభుత్వం మధ్య వారధిగా అధికారులు పని చేయాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు క్రింది స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చేసి, మౌలిక వసతుల కల్పన ద్వారా అగ్ర స్థానానికి చేర్చాలని లక్ష్యంగా పని చేస్తున్నామని అరికెపూడి గాంధీ పునరుద్ఘాటించారు. అధికారులంతా తమతో కలిసి రావాలని ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఉప కమిషనర్లు శశిరేఖ, ఇస్లావత్ సేవియా, ఏఎంసి వాహిద్ అలీ, డిప్యూటీ తహసీల్దారు దిలీప్, ప్రాజెక్ట్ అధికారులు మల్లేశ్వరి, సురేష్ పాల్గొన్నారు.



# సెన్సస్ అధికారులకు సహకరించండి

- ప్రతి పౌరుడు పూర్తి వివరాలు అందించాలి
- జనగణన దేశ భవిష్యత్తుకు కీలకం
- ఉపాధ్యాయులైన అధికారులను గౌరవించాలి
- హీట్ వేవ్‌లో క్షేత్రస్థాయి సర్వేలో జాగ్రత్తలు
- సమస్యలు పరిష్కరించి సమన్వయంతో ముందుకు

లోపలి పేజిలో

# సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించేది లేదు

## కొండాపూర్ సెంట్రింగ్ యూనియన్ స్పష్టీకరణ

**శేరిలింగంపల్లి, మే 23 (జనంసాక్షి) :**
సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము సమ్మెను విరమించబోమని, భవన నిర్మాణ పనులకు హాజరు కాబోమని కొండాపూర్ సెంట్రింగ్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. సెంట్రింగ్ యూనియన్ సమ్మె 8వ రోజుకు చేరిన సందర్భంగా కొండాపూర్ యూనియన్ కార్యాలయం నుండి ధర్నా చౌక్ వరకు దాదాపు 200 మంది

లోపలి పేజిలో




# వివోఏల సమ్మె 6వ రోజు

## ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

- గౌరవ వేతనం పెంచాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి
- మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ మద్దతు
- మంత్రి సీతక్క సమస్యలు పరిష్కరించాలి
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్

లోపలి పేజిలో



# ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామనడం దురదృష్టకరం

## ఫోర్త్ సిటీతో లక్షల మందికి ఉపాధి, ప్రాంతం అభివృద్ధి

- హరీష్ రావు వ్యాఖ్యలు అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం
- దక్షిణ తెలంగాణను వెనుకబాటు నుంచి బయటపడేస్తాం
- జూన్ 2న శంకుస్థాపనల జాతర.. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు
- గ్రీన్ ఫార్మా జోన్‌తో ప్రపంచ స్థాయి నగరం
- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



లోపలి పేజిలో

బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)ని రద్దు చేస్తామని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనాయకులు తన్నీరు హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

# బీజేపీ కుట్రలను అడ్డుకోవాలి

- నూతన అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ పని తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు
- ఓటు చోరీకి అవకాశం ఇవ్వకూడదు
- అభివృద్ధి, పార్టీ విస్తరణపై దృష్టి



**షాద్‌నగర్, మే 23 (జనంసాక్షి):**
షాద్‌నగర్ నియోజకవర్గం నూతన అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ పని తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ అధ్యక్షులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసింహారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో నాలుగేళ్లకు ఒకసారి అధ్యక్షులను మార్చాలని జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ మేరకు రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వైసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలు, మండలాల వారీగా నూతన అధ్యక్షుల ఎంపిక జరిగిందన్నారు.
రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లాంటి అంకితభావం కలిగిన నాయకుడు అండగా ఉన్నాడని, ఆయనతో కలిసి శక్తివంతంగా పని చేసి కాంగ్రెస్ పార్టీని మరింత విస్తరించాలని నూతన అధ్యక్షులకు సూచించారు. గత అధ్యక్షుల పనితీరుతో కాంగ్రెస్ గెలిచిందని, మీ పనితీరుతో మరోసారి విజయం సాధించాలని లోపలి పేజిలో

# ఇళ్ల మధ్యే 'విద్యుత్' ముప్పు

## కొత్త గద్దె సిద్ధమైనా కదలని ట్రాన్స్‌ఫార్మర్!




**అల్వాల్, మే 23 (జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం లక్ష్మీ ఎన్‌క్లేవ్ కాలనీలో సిమెంట్ కాంక్రీట్ గద్దె (ప్లాట్‌ఫాం) నిర్మాణం పూర్తయినా, ప్రమాదకరమైన పాత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త చోటికి మార్చడంలో క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక్కడి ఓ ఇంటి కాంపౌండ్ గోడకు అత్యంత ఆనుకుని ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో స్థానికులు నిత్యం భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. బొల్లారం విద్యుత్ సెక్షన్ పరిధిలో ఈ వైనం కనిపిస్తోంది. ప్రమాదాన్ని గుర్తించిన విభాగం, దీనిని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు గతంలోనే ఆమోదం తెలిపింది. అందుకోసమే కొత్త ప్రదేశంలో గద్దెను కూడా నిర్మించారు. అయితే, అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నప్పటికీ మార్పిడి ప్రక్రియను మాత్రం గాలికి వదిలేశారు. ఈ ఇబ్బందిపై కాలనీవాసులు పలుమార్లు విన్నవించినా పాలకుల్లో చలనం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో, ఎలాంటి విపత్తు జరగకముందే ఉన్నత శ్రేణి సిబ్బంది తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త గద్దెపైకి మార్చాలని లక్ష్మీ ఎన్‌క్లేవ్ నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆధ్యాత్మిక చింతనలోనే అసలైన ప్రశాంతత ఉంది

**అంబర్పేట్ మే 23 ( జనం సాక్షి)** ఈ ఆధునిక ప్రపంచంలో మానవుడు క్షణం తీరిక లేక ఉ రుకుల పరుగుల జీవితంలో మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురై సరైన జీవనశైలి ని అలవర్చుకోలేకపోతున్నాడని, తద్వారా అనేక రుగ్మతలకు గురవుతున్నాడని కేంద్ర మంత్రి మరియు సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. పెద్దమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దైవచింతన చేయాలని భగవంతుని పట్ల శ్రద్ధ ఆసక్తులతో మెలగాలని అన్నారు. ప్రతిరోజు దైవ ప్రార్థన కోసం కొంత సమయం కేటాయించి ఆ భగవత్ కృపకు పాత్రులు కావాలని, ఒత్తిడి లేని ప్రశాంత జీవితం గడపాలని, ఆ పెద్దమ్మ తల్లి దీవెనతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, ఎం ఎల్ సి అంజిరెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో వసతుల కొరత



**ఉప్పల్, మే 23 (జనం సాక్షి):** నగర పరిధి విస్తరణతో పాటు జీహెచ్ఎంసీ పరిపాలనా వ్యవస్థలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఉప్పల్ సర్కిల్‌కు ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ, కార్యాలయ వసతుల కొరత మాత్రం అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఒకప్పుడు మునిసిపాలిటీ అవసరాలకు అనుగుణంగా నిర్మించిన భవనం ప్రస్తుతం పెరిగిన పరిపాలనా అవసరాలకు సరిపోక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ సంస్కరణల అనంతరం ఉప్పల్ సర్కిల్ పరిధిలో డివిజన్ల సంఖ్య పెరగడం, పరిపాలనా బాధ్యతలు విస్తరించడం, జోనల్ కమిషనర్ స్థాయి సేవలు అందుబాటులోకి రావడం వల్ల అనేక శాఖలు ఒకే భవనం నుంచి పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్, పన్నుల విభాగాలతో పాటు జేసీ కార్యాలయం కూడా ఇదే భవనంలో కొనసాగుతోంది. అయితే భవనంలో తగినంత స్థలం లేకపోవడం, అధికారులకు ప్రత్యేక చాంబర్లు లేకపోవడం, సిబ్బంది పని చేసేందుకు సరైన వాతావరణం లేకపోవడం వల్ల పరిపాలనపై ప్రభావం పడుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. పలువురు అధికారులు ఒకే గదిని పంచుకొని పనిచేయాల్సి వస్తోందని, రికార్డుల నిర్వహణకు కూడా సరైన స్థలం లేదని సమాచారం. ఇక కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. కార్యాలయం వద్ద సరిపడా పార్కింగ్ స్థలం లేక వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ, మునిసిపాలిటీ కాలంలో నిర్మించిన ఈ భవనం అప్పటి అవసరాలకు మాత్రమే సరిపోయేదని, ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి విస్తరించడంతో మరింత విశాలమైన ఆధునిక భవనం అవసరమైందన్నారు. పెరిగిన శాఖలు, సిబ్బంది, ప్రజా సేవల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే, పౌర సేవలు మరింత సమర్థవంతంగా అందించాలంటే ఆధునిక సౌకర్యాలతో కూడిన సమగ్ర పరిపాలనా భవనం, విస్తృత పార్కింగ్ సదుపాయం, ప్రజల కోసం వేచి ఉండే హాళ్లు, డిజిటల్ సేవలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉప్పల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పరిపాలనా వసతులను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# శేషసాయి నగర్‌లో రూ.64 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

## త్వరలో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, మే 23 (జనం సాక్షి):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శేషసాయి నగర్, మల్లికార్జున్ నగర్ కాలనీల అభివృద్ధికి చేపట్టిన మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా రూ.64 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా కొనసాగుతుండగా, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి రజిత పరమేశ్వర్ రెడ్డి శనివారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో విస్తృతంగా పర్యటించిన ఆమె, స్థానిక ప్రజలతో కలిసి జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "శేషసాయి నగర్, మల్లికార్జున్ నగర్ ప్రాంతాల్లో వర్షాకాలం వచ్చినప్పుడల్లా మురుగునీరు రోడ్లపైకి రావడం, డ్రైనేజీ నిల్వల కారణంగా దుర్వాసనలు వ్యాపించడం, దోమలు పెరగడం వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవి. ప్రజలు ఎన్నోసార్లు ఈ సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆధునిక సదుపాయాలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. పనులు పూర్తయిన తర్వాత కాలనీల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది," అని తెలిపారు. అలాగే, "డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రూ.64 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా చేపడతాం. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే మా లక్ష్యం. ఉప్పల్ డివిజన్‌లో ప్రతి కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. అభివృద్ధి పనుల అమలులో ఎక్కడా నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం," అని పేర్కొన్నారు. స్థానిక కాలనీ వాసులు మాట్లాడుతూ, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి వెంటనే అభివృద్ధి పనులు చేపట్టిన రజిత పరమేశ్వర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీల అభివృద్ధికి ఆమె తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేషసాయి నగర్ కాలనీ అధ్యక్షులు అచ్చన శ్రీనివాస్, నర్సయ్య, రాకేష్ నాయక్, మోహన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, సల్ల ప్రభాకర్ రెడ్డి, పూజారి హనుమంతు, వేణుగోపాల్ రెడ్డి, విప్లవ రెడ్డి, చారి, నవీన్, వంక మాధవ్, శ్రావణి, వంశీ, మౌనిక, అనుష, భాస్కర్, తుమ్మల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉక్కుల అశోక్‌పై

# చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**ఇబ్రహీంపట్నం, మే 23(జనం సాక్షి )** జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసేలా, వారి వృత్తిని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉక్కుల అశోక్ అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పాత్రికేయులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులపై ఉక్కుల అశోక్ ఉద్దేశపూర్వకంగా, తప్పుడు ఉద్దేశాలతో సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న జర్నలిస్టుల ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించిన సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల క్షేత్రస్థాయిలో పని చేసే విలేకరుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం సిఐ మహేందర్ రెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు డబల్ జే హెచ్ 143ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెలుగు శ్రీనివాస్, పాత్రికేయులు చెరుకూరి మల్లేష్, కిషన్, సుదర్శన్, సురేష్, బుగ్గ రాములు,పాల్గొన్నారు.

# గిరిజన మహా ధర్నాను విజయవంతం చేయాలి

## గిరిజన నాయకులు ఎస్. రూప్లా నాయక్



**కేశంపేట, మే 23( జనం సాక్షి ):** ఎస్టీ ఎస్సి డిక్లరేషన్ అమలు కై లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 26వ తేదీన నిర్వహించే గిరిజన మహా ధర్నాను విజయవంతం చేయాలని మండల గిరిజన నాయకులు ఎస్. రూప్లా నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మహా ధర్నాకు సంబంధించిన గోడపత్రికను మండల గిరిజన నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రూప్లా నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల న్యాయపరమైన హక్కుల సాధన కోసం గిరిజనులంతా పార్టీలకు అతీతంగా ఏకతాటి పైకి వచ్చి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు జర్పుల రాజు నాయక్, గిరిజన నేతలు వీరేందర్ నాయక్, దీప్లా నాయక్, బిఖ్యా నాయక్, రమేష్ నాయక్, జీవన్ నాయక్, రమేష్ నాయక్, మోహన్ నాయక్, యం. రమేష్ నాయక్, అయోధ్య శ్రీనివాస్, పరుశరాం నాయక్ పాల్గొన్నారు.

# పేద ప్రజల వైద్యానికి సీఎం సహాయనిధి ఒక వరం

- కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్.
- ఆడెపు బాలకృష్ణకు రూ. 1.75 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌ఓసి అందజేత

**ఇబ్రహీంపట్నం, మే 23(జనం సాక్షి** మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన ఆడెపు బాలకృష్ణ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితి నిరుపేద కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని బాలకృష్ణ కుటుంబ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు మానిపాటి వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబ పరిస్థితిని గమనించిన గ్రామ కాంగ్రెస్ నాయకులు వెంటనే ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణమే సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 1,75,000 ఎల్‌ఓసి పత్రాన్ని మంజూరు చేయించారు. శనివారం ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్, నాయకుడు మానిపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో మంజూరైన సీఎం సహాయనిధి ఎల్‌ఓసి పత్రాన్ని లబ్ధిదారుడైన ఆడెపు బాలకృష్ణ మరియు ఆయన కుమారుడు ప్రశాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవని లాంటిదన్నారు. ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని భరోసా




ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా సీఎం సహాయనిధి, ఆరోగ్యశ్రీ పథకాలు అండగా నిలుస్తాయని, అర్హులైన పేద ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆపద సమయంలో స్పందించి పేద కుటుంబానికి ఇంతటి పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కి ఈ సందర్భంగా గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండల నాయకుడు రావుల భాష, నాయకులు మాధగోని జంగయ్య గౌడ్, మార సురేష్, దాసరమోని అశోక్ ముదిరాజ్, ఆరుట్ల గ్రామ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆడెపు మధు, కాసుల యాదయ్య, జక్కుల యాదగిరి ముదిరాజ్, మాడపాకుల కృష్ణ, మణిపాటి బుగ్గరాములు, శివశంకర్, పూజారి ప్రభాకర్ ముదిరాజ్, కాసుల బాలరాజు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నుండి 20 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరిక

- సామాజిక తెలంగాణ మా లక్ష్యం.
- తెలంగాణ జాగృతి బి సి విభాగం జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివ శంకర్.
- తెలంగాణ రక్షణ సేన చేవెళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజు
- ఎండి అన్వర్ ఖాన్,షేక్ మహమ్మద్ నూర్ భాయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**మొయినాబాద్, మే23, జనంసాక్షి:** సామాజిక తెలంగాణ మా లక్ష్యం తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్రంలో ప్రత్యేక రాజకీయ శక్తిగా పెరిగిపోతుందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యార్థులు ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువులను మధ్యలో ఆపివేస్తున్నారని టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తి విద్య ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు, బడుగు బలహీనవర్గాల పేద ప్రజల ఆరోగ్యం క్షీణిస్తే ప్రైవేటు ఆసుపత్రిలో డబ్బులు కట్టలేక విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని అలాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో రాకూడదని ప్రతి పేదవాడికి వైద్యం ఉచితంగా ఇవ్వాలని సంకల్పంతో ఏర్పడ్డ తెలంగాణ సామాజిక తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎజెండాను చూసి ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని వారు అన్నారు ఈ సందర్భంగా శనివారం నాడు మండల పరిధిలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం వివిధ గ్రామాల నుండి నజీబ్ నగర్ గ్రామం బిఆర్ఎస్ నాగారం కృష్ణ యాదవ్, కాశింభౌలి గ్రామం,బిజెపి సామ సాయి వర్ధన్ రెడ్డి, సజ్జన్ పల్లి గ్రామం బిఆర్ఎస్ కత్తుల నరేందర్, సరుపు కృష్ణ, ఎనికె పల్లి బిఆర్ఎస్.ఎస్ అమర్



యాదవ్, పెండ్యాల గోపాల్, మొయినాబాద్ మున్సిపాలిటీ ఎండి పాషా, శ్రీరాశీ నగర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ దొడ్డి సాయి కుమార్ యాదవ్, ఎండి ఖాన్ సాబ్, ఎండి గౌస్, ఎండి అలీమ్, ఎండి జోహార్, షేక్ లతీఫ్, షేక్ అలీ, షేక్ అమిత్, షేక్ షరీఫ్, ఎండి ఐబ్ ఖాన్, ఎండి షఫీ ఎండి రఫీక్ ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకులు చాకలి విక్రమ్, బొక్క సురేందర్ రెడ్డి, మలని రాజు ఏనుగుల సంజీవరెడ్డి, గాండ్ల సంతోష్, ఎండి ఇనాయత్,యండి ఏయా, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ క్రై స్మార్ట్ బీస్"ప్రీ స్కూల్, ను ప్రారంభించిన ఎమ్మెల్యే కె పీ వివేకానంద

**నిజాంపేట్ మే 23( జనం సాక్షి)** నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో రంజిత్ గౌడ్ పాలమాకుల, సుమ శ్రీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఫస్ట్ క్రై స్మార్ట్ బీస్" ప్రీ స్కూల్, డే కేర్ స్కూల్ ను శనివారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జోనల్ మేనేజర్ రవి, అకాడమిక్ మేనేజర్ కళ్యాణి, ఆపరేషన్ హెడ్ శ్రీనివాస్, పవన్, సెంటర్ మేనేజర్లు శ్వేత కోగంటి, ప్రసన్న లక్ష్మి, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ఆగం రాజు, మాజీ కౌన్సిలర్ శంబిపూర్ కృష్ణ, కార్పొరేటర్లు రవి



కిరణ్, బాలాజీ నాయక్, చందు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు సలీం, సతీష్, నాయకులు వేణు గౌడ్, బొబ్బ శ్రీనివాస్, మహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# చారధామ్ యాత్రలో గంగోత్రి అమ్మవారి దర్శనం

**రాజేంద్రనగర్,మే23(జనంసాక్షి)** చార్ధాదామ్ యాత్రలో భాగంగా మణికొండ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్వేతతో కలిసి గంగోత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు. మణికొండ ప్రాంతానికి చెందిన పలువురు భక్తులు కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు.



# విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలి



**అంబర్పేట్ మే 23( జనం సాక్షి)** ఎంతో కాలంగా విద్యార్థులు ఎదురుచూస్తున్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన కాచిగూడ లో బిసి కుల సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలోవిద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వటంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, విద్యార్థులు నిత్యం రియంబర్స్మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఎస్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, మే 23 (జనంసాక్షి)** మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మిర్జాల్‌గూడ డివిజన్ వాణీ నగర్ వీధి నెంబరు 2 లో 54 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ సునీత రాము యాదవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కాలనీల్లో డ్రైనేజీ, సిసి రోడ్లు, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు వెంకన్న, మేకల రాము యాదవ్, బైరు అనిల్, కిట్టు, నర్సింగ్ రావు, భిక్షపతి, రెబ్బా వాసు, శ్రీరామ్ యాదవ్, సీతా శంకర్ యాదవ్, అజీజ్, భాగ్యవతి తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్రం ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అభిజిత్‌కు బెదిరింపులు

## సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముషీరాబాద్, మే 23 (జనం సాక్షి):** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడైన అభిజిత్‌ను భయభ్రాంతులకు గురిచేస్తూ, బెదిరించడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై యువత నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను గమనించి, తమ విధానాలను మార్చుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు సిటీ అయ్యాం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. "నువ్వు బీజేపీలో చేరు, డబ్బులు వస్తాయి, లేకపోతే నిన్ను అమెరికాలోనే ఖతం చేస్తాం. భారతదేశంలో ఉన్న నీ కుటుంబాన్ని, నీ తల్లిదండ్రులని కూడా వదలకుండా ఖతం చేస్తాం" అంటూ బెదిరింపులకు దిగడం అత్యంత దుర్మార్గనన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వ్యక్తిని, ఆయన కుటుంబాన్ని ఈ విధంగా భయభ్రాంతులకు గురిచేసే ధోరణి ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం అని అన్నారు. అభిజిత్ 'దళిత కార్డ' వాడుతున్నాడని, 'స్కిల్స్ (నైపుణ్యాలు) లేవు' అని అవమానకరంగా మాట్లాడుతున్నారు, ఇది రాజ్యాంగం అందించిన ప్రజాస్వామిక హక్కులను, లౌకిక భావాలను, సోషలిస్టు ఆశయాలను కాపాడడంలో కేంద్రం పూర్తిగా చేతులెత్తేసిందనీ చెప్పారు. బెదిరింపులు, భయభ్రాంతులు, హత్య రాజకీయాల ద్వారా యువత గొంతు నొక్కాలని చూస్తే ప్రభుత్వాలు భ్రమల్లో ఉన్నట్టేనని, ఇటువంటి అణచివేత చర్యలను నేటి యువతరం సహించదనీ అన్నారు.

# కలుషిత మంచినీటి సరఫరా క్షేత్రస్థాయిలో పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, మే 23 (జనం సాక్షి)** హయత్‌నగర్ పాత గ్రామం లోని పలు ప్రాంతాలలో మంచినీటి సరఫరాలో కాలుష్యం ఏర్పడుతున్నట్లు స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి లైన్‌మ్యాన్ శ్రీనివాస్ తో కలిసి సంబంధిత ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ కలుషిత నీటి సరఫరాకు గల కారణాలను గుర్తించి, సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని జలమండలి సిబ్బందికి సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా పైప్‌లైన్లను తనిఖీ చేసి, ఎక్కడైనా లీకేజీలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటామని నవజీవన్ రెడ్డి తెలిపారు.

# వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన..!!

**• అసమర్థ కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ • ప్రజలు పడుతున్న నీటి కష్టాలను తీర్చాలి**
**• ఖైరతాబాద్‌లో తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ నేతల ధర్నా • ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి**



**హయత్ నగర్, మే 23 (జనం సాక్షి)** జంట నగరాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, మహిళలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పరిపాలన చేతకాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాడని, మళ్ళీ హైదరాబాద్ ప్రజలు నీటి కోసం లైన్లు కట్టి, బిందెలతో పోట్లాడుకునే పరిస్థితి తెచ్చాడని, ప్రజా పాలన పేరుతో ప్రజలను కష్ట పెడుతున్నాడని అన్నారు. తాగునీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో దాదాపు రెండు నెలల నుంచి మంచినీటి సమస్య ఉందని చెప్పిన పట్టించుకోవడంలేదని తెలిపారు. 750 ఎంజిడి అవసరముంటే 550 ఎంజీడి సరఫరా చేస్తున్నారన్నారు. రోజుకు 12 వేల ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటన్న ఈ ప్రభుత్వం పైపులైన్ ద్వారా సరఫరా చేయడం లేదని స్పష్టంగా అర్థం అవుతుంది అని అన్నారు. మంచినీటి సరఫరా విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు, లేని పక్షంలో మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ భారస నాయకులు, ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 7న వ్యవసాయ కార్మిక సంఘం యాచారం మండల 12వ మహాసభ: పి. అంజయ్య



**యాచారం, మే 23(జనం సాక్షి )** జూన్ 13, 14 తేదీల్లో షాద్‌నగర్‌లో రంగారెడ్డి జిల్లా మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో, ఆలోపే యాచారం మండల 12వ మహాసభను జూన్ 7 ఆదివారం రోజున కొత్తపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య ప్రకటించారు. శనివారం యాచారం మండల కమిటీ సమావేశం కామ్రేడ్ జగన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి. అంజయ్య మాట్లాడారు. భూమి, ఉపాధి, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందని అంజయ్య పేర్కొన్నారు. కరువు కాలంలో కూలీలను ఆదుకుంటున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా రద్దు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అందులో భాగంగానే రెండు సార్లు ఫోటోలు తీసే నిబంధన తెచ్చి కూలీలను ఎండలో గంటల తరబడి నిలబెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని మార్చి జి రామ్ జి చట్టాన్ని తెచ్చి కూలీల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. నిత్యవసరాల ధరలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి మరింత భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పింఛన్లను పెంచాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, కూలీలకు ఇస్తామన్న 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. పరిశ్రమల పేరుతో సాగుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని హితవు పలికారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన బాధితులకు పూర్తి పరిహారం, ప్లాట్లు ఇవ్వకుండా భూములను స్వాధీనం చేసుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పుష్ప, మండల నాయకులు ఎం. జంగయ్య, ఎం. రాములు, ఇందిరమ్మ, పి. జంగయ్య, పి. రమేష్, ఎస్. రాములు, సురేష్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మే 23 (జనంసాక్షి)** సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 32 మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సీఎం సహాయనిధి ఆర్థికంగా దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఒక వరంగా ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, ఎం.కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యా గౌడ్, సర్పంచ్ గౌడిచేర్ల శ్రీనివాస్, పడాల ప్రభాకర్, రాములు, గుడిమాల్కపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, నడిమోళ్ల శంకర్, కుంచం శివకుమారుప్పా, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తిప్పని రామ్ రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, మద్దెల చింటు, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

## బోరబండ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**ముషీరాబాద్, మే 23 (జనం సాక్షి):** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన మహాధర్నాలో అధికమైన ఎండ, వేడిని సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున పాల్గొన్న సెంట్రింగ్ కార్మికులకు బోరబండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాక్సూద్ ఉచిత భోజన మంచినీటి సదుపాయాలు కల్పించి, మహాధర్నాలో పాల్గొన్న కార్మికుల దాహార్తిని తీర్చారు. ఈ కార్యక్రమంలో బోరబండ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ మక్సూద్, వెంకటేష్, అమీరుద్దీన్, ఫక్రుద్దీన్‌లు పాల్గొన్నారు.

## గగన్‌పహాడ్ అండర్‌పాస్ దుస్థితిపై అధికారులు స్పందించాలి



**రాజేంద్రనగర్,మే23(జనంసాక్షి)** గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్ అండర్‌పాస్ వద్ద గత 16 సంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజ్ లీకేజ్ సమస్యపై మైలార్ దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి అధికారుల వైఫల్యం పై మండిపడ్డారు. 2009లో అండర్‌పాస్ ప్రారంభమైనప్పటి నుంచి మురుగు నీరు జలపాతం లాగా ప్రధాన రహదారిపై పడుతూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దుర్వాసన, దోమల పెరుగుదల, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదకర పరిస్థితులు రోజువారీ సమస్యగా మారాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి నీటి నిల్వలు ఏర్పడి వాహనదారులు, స్కూల్ పిల్లలు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జారిపడే ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై ఇంతకాలంగా సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. 2009 నుంచి ఇదే స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని వినయ్ రెడ్డి పేర్కొన్నారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ సంబంధిత శాఖలు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే స్థానిక ప్రజలు, వాహనదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## క్రీడల ద్వారా పిల్లలలో ఏకాగ్రత, క్రమశిక్షణ,ఆత్మ విశ్వాసం పెరుగుతాయి

### కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**హయత్ నగర్, మే 23 (జనం సాక్షి)** ఎల్.బి నగర్ నియోజకవర్గం, మన్సూరాబాద్ డివిజన్ మల్లికార్జున్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో రంగారెడ్డి క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సీనియర్ స్టేట్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ కార్యక్రమానికి జిహెచ్ఎంసి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, పోచబోయిన సురేష్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరై, కమిటీ సభ్యులు, ఆదర్శ సీనియర్ సిటిజన్స్ సభ్యులతో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు, ముఖ్యంగా 80 సంవత్సరాల వయస్సు గల వారు కూడా కుటుంబ సభ్యులతో కలిసి ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేలా తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ వారు అద్భుతమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సమ్మర్ హాలిడేస్ సమయంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు, డ్రగ్స్, ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేందుకు ఇలాంటి ఇండోర్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించడం ఎంతో అవసరమని అన్నారు. క్రీడల ద్వారా పిల్లల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, తల్లిదండ్రులు కూడా పిల్లలను ఆటల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షులు టి. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మోహన్, ఆదర్శ సీనియర్ సిటిజన్స్ చింతారెడ్డి కృష్ణా రెడ్డి, చీఫ్ ప్యాట్రన్ అండ్ ప్రెసిడెంట్ ఇ.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ బి.రామ్ రెడ్డి గౌరవ అధ్యక్షుడు రామ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు క్రీడాకారులు, కాలనీవాసులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీలపై విరుచుకపడ్డ తేనెటీగలు

- **30 మంది కూలీలకు గాయాలు.**



మర్పల్లి మే 23 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామ సమీపంలో శనివారం ఉదయం ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలపై ఒక్కసారిగా తేనెటీగల గుంపు దాడి చేయడంతో 30 మంది కూలీలుకు గాయపడ్డారు. రోజు మాదిరిగా సిరిపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శనివారం ఉదయం ముక్క గడ్డ సమీపంలో పనులకు వెళ్లారు. ఉదయం 8 సమయం లో అందరూ పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు పెద్ద ఎత్తున కూలీలపై విరుచుకుపడ్డాయి. భయాందోళనలకు గురైన కూలీలు కేకలు వేస్తూ పొలాల్లోకి చెట్ల చాటునకు ఒకరి ఒకరు చూసుకుంటూ పరుగులు తీశారు. వెంటనే స్థానికులు గాయపడ్డ వారిని మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరికొందరిని గ్రామంలో ఉన్న ఆసుపత్రికి, మరికొందరిని మోమిన్ పేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన బాధితులు తేనెటీగల దాడిలో ఎక్కువ గాయపడిన వారిలో కుమ్మరి మామయ్య, రమణ గారి ఈశ్వరమ్మ, మంత్ బలవంత్ రెడ్డి, మాతో మల్ రెడ్డి, మోటు నాగయ్య, బట్టు ముత్తమ్మ, బట్టు బాలమని, ఎర్రోళ్ల నర్సమ్మ, ముళ్ళ నసినాబి సహా దాదాపు 30 మంది ఉన్నారు. విషయం తెల్సిన వెంటనే గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామ్శించారు. డాక్టర్లతో మాట్లాడి కూలీలకు మెరుగైన ఉచిత వైద్యం అందేలా చొరవ తీసుకున్నారు.రెండు పూటల విధానంపై కూలీల ఆగ్రహం -నిరసనఈ ప్రమాదం నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేట్ స్థాయిలో అమలు చేస్తున్న ఈ 'రెండు పూటల ఫోటో క్యాప్చర్ ' విధానం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఉదయం పూట ఇలాంటి ప్రమాదాలు ఎదురవ్వడమే కాకుండా, మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ తాకిడికి గురికావాల్సి వస్తోందని మండిపడ్డారు. "వద్దు వద్దు.. రెండు పూటల విధానం మాకు వద్దు" అంటూ కూలీలు అక్కడే నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్‌స్కిల్డ్ కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకొని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ రెండు పూటల ఫోటో విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా :ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మే 23 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఊరెళ్ళ వార్డులో బోరు మోటర్ ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులో మంచి నీటిని పరిష్కరించేందుకు చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, చొరవతో పాత బోరు ను పునరుద్ధరించిన బోరు మోటార్ ను ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అవసరమున్న చోట బోర్లు వెయిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ లు బండారి శైలజా ఆగి రెడ్డి, దూత మల్లేష్, దప్పు సువర్ణ, పడాల ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్లు పడాల ప్రభాకర్, జాంగిర్, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ కర్నె శివప్రసాద్, కుంచం శివకుమార్, టేకులపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ హెచ్చరిక

- **తెలంగాణ రాష్టంలో మాలల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాలల సత్తా చూపిస్తాం.**



**నవాబుపేట్ : మే 23( జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మాల సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ మాట్లాడుతూ మాల విద్యార్థి ,ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా ఖండించారు.ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణలో,రోస్టర్ విధానములో అన్యాయం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ, జనాభా లెక్కల్లో మాల సామాజిక వర్గాన్ని తక్కువ చేసి చూపించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 2011లో 15 లక్షల 27,683 ఉన్న సింగిల్ మాల కమ్యూనిటీ 16 సంవత్సరాలు తర్వాత 14 లక్షల అరవై తొమ్మిది వేలని చూపించిన విధానాన్ని తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో మూడవ అత్యంత జనాభా కలిగిన మాలలకు ఎస్సీ వర్గీకరణలో,రోస్టర్ విధానలో జనాభా లెక్కలు,తీవ్ర అన్యాయం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుర్తు చేస్తున్నామన్నారు.మాలల జీవితాలలో చీకటిమయం చేసి 10 ఉద్యోగ నోటిఫికేషన్లలో ఒక్క ఉద్యోగం రాకుండా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతం మాలల పంతముగా మారబోతుందని చెప్పి గుర్తు చేస్తా ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి మొదటి నుంచి మాలలకు వ్యతిరేకంగానే పనిచేస్తున్నాడని మేము భావిస్తూ ఉన్నము, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మైనింగ్ మంత్రి వివేక్ మీద ఉన్న కోపంతో మాలల జీవితాలతో చెలగాటమాడుతున్న తీరును తెలంగాణలో ఉన్న మాల విద్యార్థులు ,నిరుద్యోగులు, ఉద్యోగస్తులు మాల ప్రజానికం చూస్తుంది.తడి బట్టతో గొంతు కోసినట్టు మాలలకు రిజర్వేషన్ లేకుండా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే మహా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ భావిస్తుంది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చెరుకు రామచంద్రం,గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరబాలకిషన్(బాలన్న),మాల జేఏసీ నాయకులు శివరాజ్,అనంత రాములు, వెంకటయ్య, గాలయ్య,శామయ్య,పద్మారావు,శ్రీనివాస్,మాణిక్యం,జర్నలిస్టులు రాజు,లక్ష్మణ్,రమేష్, నర్సిములు,తదితరులు పాల్గొన్నారు

# హనుమాన్ ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలి

## ఆలయ చైర్మన్ శాతెల్లి రంగారెడ్డి



**మర్పల్లి మే 22 (జనంసాక్షి)** మర్పల్లి గ్రామంలో ఉన్న శ్రీ హనుమాన్ ఆలయ అభివృద్ధికి భక్తులు గ్రామ ప్రజలు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ శాతెల్లి రంగారెడ్డి అన్నారు. శనివారం మర్పల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల అనుసారం భక్తులందరూ నిబంధనలు పాటించాలని అన్నారు. భక్తుల సేవలకు సంబంధించి నిర్ణీత రుసములను చెల్లించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఆయన అన్నారు. కొబ్బరికాయ కొట్టడానికి రూ.10/-, అర్చన టికెట్ -- రూ.21/-,,చందనం సేవ -- రూ.201/-,,వివాహ సమయం (వధువు తరపున) రూ.521/-,,వివాహ సమయం (వరుడి తరపున) -- రూ.1,101/-, నిర్ణయించడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి కైలాస్ జోషి, ఉప సర్పంచ్ కొప్పుల ప్రభు, వీరేశం, సిద్ధిరామప్ప, సుధాకర్, నర్సింలు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండల కేంద్రంలో కరెంటు సరఫరా నిలిపివేత



**మర్పల్లి మే 23 (జనంసాక్షి)** నేడు ఆదివారం మర్పల్లి మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు వెడల్పు పనిలో కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయునన్నట్లు విద్యుత్ అధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నందు కారణంగా గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# అందుబాటులో సబ్సిడీలో జనుము విత్తనాలు

- **ప్రతి రైతుకు ఒక బ్యాగ్ మాత్రమే**



**మర్పల్లి మే 23 (జనంసాక్షి)** మండలంలో 2026-27 వానకాలం సాగుకు సంబంధించి రైతులకు ఉపయోగపడే విధంగా 150 బ్యాగుల జనుము (పచ్చి రొట్టె) విత్తనాలు అందుబాటులోకి వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి బ్యాగ్‌లో 40 కిలోల విత్తనాలు ఉండగా, ఒక ఎకరానికి సరిపడే విధంగా వీటిని పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఒక్కో 40 కిలోల బ్యాగ్‌ను రూ. 3,110/- లకు రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు.ప్రతి రైతుకు ఒక బ్యాగ్ మాత్రమే ఇవ్వబడుతుందని, ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. రైతులు ఆధార్, రైతు పాస్‌బుక్జిరాక్స్ కాపీలతో మర్పల్లి మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం ను సంప్రదించాలని సూచించారు.

# చెరువులో పడి మహిళా మృతి



**షాబాద్, మే 23(జనం సాక్షి) ;** అనారోగ్య కారణాల వలన ఇబ్బంది పడుతూ, సరిగా మతిస్థిమితం లేకపోవడంతో మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఇన్స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని అంతారంకు చెందిన కావలి సుజాత (40) ముగ్గురు సంతానం, గురువారం ఇంట్లో ఎవరు లేని సమయాన చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్లగా సాయంత్రం సమయానికి ఊరిలో ఎంతగా వెతికినా ఆచూకీ లభించకపోగా, షాబాద్ కు వెళ్లిందని తెలియగా, శుక్రవారం రాత్రి షాబాద్ పైల్వాన్ చెరువులో పడి మృతి చెందినట్లు సమాచారం మృతురాలి తమ్ముడు కావలి పెద్ద సుధాకర్ గ్రామం చాన్గమల, మండలం పూడూర్, జిల్లా వికారాబాద్ తెలియగానే వెంటనే షాబాద్ పైల్వాన్ చెరువు చేరుకొని మతిస్థిమితం లేక, అనారోగ్య కారణంతో బాధపడుతూ పిల్లలకు తెలియకుండా వచ్చి చెరువులో దూకి మృతి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### బక్రీద్ సందర్భంగా గొర్ల వ్యాపారుల సమస్యలపై

# కురుమ సంఘం వినతి



**రాజేంద్రనగర్,మే23(జనంసాక్షి)** తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమైక్య చైర్పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్యను హైదరాబాద్ పాలమూరు కురుమ సంఘం జంటనగరాల అధ్యక్షుడు, కాటేదన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు మందారం కృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం 15/1951 ప్యానెల్-2 నాయకులు వారి కార్యాలయంలో కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే 27, 28 తేదీల్లో బక్రీద్ పండుగ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చి గొర్రెల వ్యాపారం చేసే కాపరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపారులకు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలపై నాయకులు వివరించగా, సరిత తిరుపతయ్య సానుకూలంగా స్పందించి పోలీస్ శాఖ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనాథ్, కారికే సత్యనారాయణ, చిన్నపల్లి సురేష్, అశోక్, ఆడికే సంతోష్, కారికే సాయి, రమేష్ కురుమ, పూజారి ప్రవీణ్, ఐలేష్, ఉప్పుల్ శ్రీను, పోచయ్య, శ్రీనివాస్, రాజు, రవి, ఆనంద్, శంకర్, శేఖర్, కిరణ్, నరేష్, రిషి, రామ్ తదితర కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గాండ్లగూడ చైన్ స్నాచింగ్ కేసును 24 గంటల్లో ఛేదించిన యాచారం పోలీసులు

**యాచారం, మే 23(జనం సాక్షి )** యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాండ్లగూడ గ్రామంలో నిన్న జరిగిన చైన్ స్నాచింగ్ ఉదంతాన్ని యాచారం పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. లూటీకి పాల్పడిన పాత నేరస్థుడిని సిఐ నందీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్ బృందం గుర్తించి, అరెస్ట్ చేసి, శనివారం కోర్టు ముందు హాజరుపరిచి జుడీష్యల్ రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాండ్లగూడ గ్రామంలో ఒక మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు మరియు బంగారు గుండ్లను ఒక గుర్తుతెలియని వ్యక్తి బలవంతంగా లాక్కొని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సిఐ నందీశ్వర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపి, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుడు కట్టా గట్టా రెడ్డి వయస్సు: 27 సంవత్సరాలు గా గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు కట్టా గట్టా రెడ్డి ఒక అలవాటు పడిన నేరస్థుడిగా తేలింది. ఇతనిపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో అనేక క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడిని పూర్తిగా విచారించిన అనంతరం, కోర్టులో హాజరుపరిచి న్యాయస్థానం ఆదేశాల మేరకు జుడీష్యల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది. అపరాధాన్ని జరిగిన 24 గంటల్లోనే ఛేదించి, నిందితుడిని పట్టుకున్న సిఐ నందీశ్వర్ రెడ్డి ని మరియు యాచారం పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజా రక్షణే ధ్యేయంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు

## ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం

### రాష్ట్ర మహిళ శక్తి మై వాయిస్ సంఘం అధ్యక్షురాలు హైమారెడ్డి



శామీర్ పేట్, మే 23(జనం సాక్షి ) మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమంను రాష్ట్ర అధ్యక్షు రాలు హైమారెడ్డి శామీర్ పేట్ డివిజన్ పోతాయిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో గ్రామ ప్రజల సమస్యల పై వినతులు తీసుకొని ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకం కోసం 190 దరఖాస్తులను స్వీకరించారు. ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలందరికి ఉచితంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. హైమారెడ్డి వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళ శక్తి మహిళా సంఘం మరియు బిజెపి రాష్ట్ర నాయకురాలు, రమేష్ అంబటి మహిళా శక్తి ట్రెజరర్, బిక్షపతి గౌడ్ బిజెపి సినియర్ నాయకులు, టి రాము బిజెపి నాయకులు, సుజాత బిజెపి నాయకురాలు, గ్రామస్తులు: శీలా, బాబురావు, సురేందర్, రామానుజన్ గౌడ్, సునీత గౌడ్, శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతో పాటు పర్యావరణ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



**మొయినాబాద్, మే 23, జనంసాక్షి:** ఉన్నత విద్యలో విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణ, ప్రజల అవగాహన నడవడికల పరిసరాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జ్ఞాన సోద్ రూరల్ హిమాక్షన్ అధ్యాపకురాలు సంయుక్త అన్నారు. గత మూడు రోజులుగా మండల పరిధిలోని శ్రీరామనగర్, సజ్జన్పల్లి, ఎత్మర్పల్లి, ఎలగూడ, నక్కలపల్లి, తోల్కట్ట గ్రామాలలో విద్యార్థులు ఫీల్డ్ హిమాక్షన్ కార్యక్రమాలపై పర్యటించారు. ఈ సందర్భంగా నక్కలపల్లిలో గ్రామ పరిసరాలు, ప్రజల జీవనోపాధి, విద్యా ఆరోగ్యం, తాగునీరు, మౌలిక వసతులు, ఆహార పదార్థాలు, కుటుంబ పోషణ, ప్రజల నడవడికలు, ఆర్థికాభివృద్ధి వివిధ అంశాలపై సామాజిక బాధ్యత సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రామాలలో ప్రజలతో పర్యటించి నేర్చుకున్న వాటిని ముందుగా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని కేజీరెడ్డి కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం జ్ఞాన సోద్ అనే రూరల్ హిమాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెంటర్ ఫర్ ఇమెషన్ సోషల్ ట్రాన్స్ఫరేషన్ ఆధ్వర్యంలో పల్లె, సృజన సహకారంతో ఈ కార్యక్రమం సజావుగా కొనసాగుతుందన్నారు. రంగారెడ్డి జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాలోని డోర్నాల్, వనపర్తి జిల్లాలోని మామిడిమాడ తండా, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, కామారెడ్డి జిల్లాలోని బంజేపల్లి తండా ప్రాంతాలతో పాటు మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాలలో విద్యార్థులు ఫీల్డ్ హిమక్షన్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థులు స్థానిక ప్రజలతో ఒకొక్క జిల్లాలో మూడు రోజులు అక్కడే ఉండి వారి మమేకమై జీవనోసాధి సర్యావరణ, విద్యా, ఆరోగ్యం, తాగునీరు, మౌలిక వసతులు వంటి విభిన్న అంశాల ప్రజల ద్వారా అవగాహన పెంచుకోవడం అభినందనీయమన్నారు. గ్రామీణ సమాజంలోని అవసరాలను ప్రత్యేక్ష అనుభవాల ద్వారా అర్థం చేసుకోవడం ద్వారా విద్యార్థులలో మంచి సానుభూతి, సామాజిక బాధ్యత కలిగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సంయుక్తతో పాటు సిఐఎస్పి బృందంలోని లింగంనాయక్, డాక్టర్ శ్రీనివాస్, ఎం. లక్ష్మణ్, రవికుమార్, కె. సచిన్, ప్రణయ్, నిహారిక, ప్రీతి తదితరులు విద్యార్థులతో పాల్గొని కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంజనీర్లుగా అకాడామిక్ విద్యతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

### వార్డు సభ్యులు బేగరి రాంచంద్రయ్య మాతృమూర్తి


## జ్ఞాపకార్థ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య



నవాబుపేట్ మే,23( జనం సాక్షి ) అక్నాపూర్ గ్రామ వార్డు సభ్యులు బేగరి రామచంద్రయ్య,తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బేగరి దేవదాస్ మాతృమూర్తి స్వర్గీయ బేగరి చంద్రమ్మ జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమం శనివారం వారినివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై బేగరి చంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బేగరి చంద్రమ్మ ఎంతో కష్టపడి కుటుంబాన్ని ముందుకు నడిపించిన గొప్ప మహిళ అని కొనియాడారు. గ్రామ ప్రజలతో ఆప్యాయంగా మెలుగుతూ అందరి ప్రేమాభిమానాలు పొందారని గుర్తు చేశారు. పెద్దలను గౌరవించడం, వారి జ్ఞాపకాలను స్మరించుకోవడం ప్రతి కుటుంబ బాధ్యత అని అన్నారు. సమాజంలో కుటుంబ విలువలను,బంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. బేగరి దేవదాస్ కుటుంబం గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండి సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే ప్రశంసించారు. గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. బేగరి చంద్రమ్మ సేవలను స్మరించుకుంటూ పలువురు గ్రామ పెద్దలు ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు చంద్రయ్య గౌడ్,బలరాం,నాయకులు కందాడ నాగిరెడ్డి, రంగారెడ్డి,ఆనంద్ రాజ్, నర్సిములు, వెంకటయ్య, రామచంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపస్ సెలక్షన్లలో 'ఎంఎల్ఆర్ఐటీ' సరికొత్త రికార్డు

### అత్యధిక ప్యాకేజీ రూ. 51 లక్షలు



**అల్వాల్ మే 23(జనంసాక్షి):** ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఎంఎల్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ 2026 క్యాంపస్ సెలక్షన్లలో సరికొత్త రికార్డు సృష్టించింది. కాలేజీ చరిత్రలోనే అత్యధికంగా ఒక విద్యార్థి ఏకంగా రూ. 51 లక్షల వార్షిక ప్యాకేజీని అందుకోగా.. మొత్తం 35కి పైగా ప్రముఖ కంపెనీల నుంచి 621 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ ఏడాది ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టీసీఎస్, డెలాయిట్ వంటి 36కు పైగా గ్లోబల్ ఐటీ సంస్థలు పాల్గొనగా, విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌తో పాటు ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఫిన్‌టెక్ వంటి లేటెస్ట్ టెక్నాలజీ రంగాలలో కొలువులు సాధించారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా మొదటి ఏడాది నుంచే టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ ప్రాక్టీస్, మాక్ ఇంటర్వ్యూలతో కార్పొరేట్ ప్రపంచానికి సిద్ధం చేయడమే ఈ విజయ రహస్యమని సంస్థ ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. న్యాక్ 'ఎ' గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌తో పాటు అత్యాధునిక ల్యాబ్‌లు, ఇండస్ట్రీకి తగ్గ సిలబస్ ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా మార్చేందుకు తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# సెన్సస్ అధికారులకు సహకరించండి

**శేరిలింగంపల్లి, మే 23 (జనంసాక్షి):** జనగణన ప్రక్రియను నిర్వహిస్తున్న సెన్సస్ అధికారులు గౌరవప్రదమైన హోదా కలిగిన ఉపాధ్యాయులని, వారికి తప్పకుండా సహకరించి పూర్తి వివరాలు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు.

శనివారం సెంట్రల్ సెన్సస్ బృందంతోపాటు శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ తదితరులతో కలిసి ఖాజాగూడలోని కార్ల టర్న్ క్రీక్ అపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న జనగణన కార్యకలాపాలను ప్రత్యక్షంగా సమీక్షించి, ఎన్యూమరేటర్లు మొబైల్ ఫోన్లలో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, జనగణన ప్రక్రియ దేశ భవిష్యత్తు మరియు సమాజ హితంతో ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా సంపూర్ణ వివరాలను సెన్సస్ అధికారులకు అందించాలని సూచించారు. జనగణన విజయవంతంగా అమలు కావాలంటే ప్రతి పౌరుడు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న జనగణన అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న జోనల్ కమిషనర్, ప్రస్తుతం వేడిని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలతో సర్వే చేపట్టాలని సూచించారు. సెన్సస్ అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జీహెచ్ఎంసీ అధికారులు, చార్జ్ అధికారులు ప్రథమ ప్రాధాన్యతగా పరిష్కరించి సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సందర్శనలో ఉప కమిషనర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తుంకిమెట్ల బిజెపి పార్టీ బూత్ స్థాయి కమిటీ ఎన్నికలు

### 194వ బూత్ అధ్యక్షుడిగా మేదరి శేఖర్
### 195వ బూత్ అధ్యక్షుడిగా బ్యాగరి మహేష్ ఏకగ్రీవ ఎన్నిక

బొంరాస్ పేట,మే 23 ( జనం సాక్షి): మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు నర్సింలు, వార్డు మెంబర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. 194వ బూత్ స్థాయి అధ్యక్షుడిగా మేదరి శేఖర్ ,195వ బూత్ స్థాయి అధ్యక్షుడిగా బ్యాగరీ మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య నాయుడు, మండల అధ్యక్షుడు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త



పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉప్పు జగదీశ్వర్,నాగురావు గ్రామానికి చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బటర్‌ఫ్లై ఫామ్ హౌస్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి




**శంషాబాద్,మే23(జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హమీదుల్లానగర్ గ్రామంలోని బటర్‌ఫ్లై ఫామ్ హౌస్‌లో అక్రమంగా పేకాట ఆడుతున్న వారిపై శంషాబాద్ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున అందిన సమాచారం మేరకు ఎస్ఐ డి. బాల్ రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు ఫామ్ హౌస్‌పై దాడి నిర్వహించారు. అక్కడ కొంతమంది వ్యక్తులు మూడు కార్డుల పేకాట బెట్టింగ్ నిర్వహిస్తూ జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పూజారి శ్రవణ్ కుమార్, కౌడి రిషికేశ్, గ్యారా పురుషోత్తం, ఖరగర సాగర్ కుమార్, వద్లూరి సాయి కుమార్, కటకం సాయి కుమార్, యంజాల భరత్ కుమార్, మెరుగు బాలరాం ఆనంద్‌లను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు ఆలే రమేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ. 35 వేల నగదు, ఆన్‌లైన్ లావాదేవీ లకు ఉపయోగించిన 8 సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

## రేపటి నుంచి జనుము విత్తనాలు పంపిణీ:ఏవో పోలప్ప

### 40 కేజీల బస్తా రూ.3,110.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**బొంరాస్ పేట, 23 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవ కేంద్రం,తుంకిమెట్ల అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో 90 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పోలప్ప తెలిపారు. జనుము విత్తనాలు పూర్తి ధర క్వింటాలుకు రూ. 7,775 కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఒక బ్యాగు (40 కేజీలు) రూ. 3,110 మాత్రమే రైతులకు అందిస్తుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్ కార్డు తీసుకొని ఆయా గ్రామాల పరిధిలోని క్లస్టర్ ఏఈఓలను సంప్రదించి పర్మిట్ టోకెన్ తీసుకుని విత్తనాలు పొందాలన్నారు. వ్యవసాయ భూముల్లో కర్బన శాతాన్ని పెంచి ,నేల సారాన్ని మెరుగుపరచడానికి పచ్చి రొట్టె ఎరువులు పంటలు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా జీలుగ/జనుము పంటను పచ్చి రొట్టె ఎరువుగా సాగు చేయడం ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి, భూమి ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గుతుందన్నారు. పంట వేగంగా పెరిగి అధిక పచ్చి జీవపదార్థాన్ని అందించడం వల్ల భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుంది. తద్వార భూమి తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడి, తదుపరి పంటకు అధిక దిగుబడులను సాధించేందుకు దోహదపడుతుందన్నారు. అధిక ప్రయోజనాలు కలిగిన పచ్చిరొట్ట ఎరువుల పంటలను రైతులు విస్తృతంగా సాగు చేసి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆల్కాపూర్ టౌన్‌షిప్ వేధింపుల కేసులో నిందితుడి అరెస్ట్

**రాజేంద్రనగర్,మే23(జనంసాక్షి) :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్కాపూర్ టౌన్‌షిప్‌లో మహిళపై వేధింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున తన రెండున్నరేళ్ల చిన్నారిని ప్లే స్కూల్ నుండి తీసుకుని ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి వెంబడించి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆమె కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో వడ్డే నాగరాజు (26)ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ప్రస్తుతం పుప్పాలగూడలో నివసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చాకలిపల్లి గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. నిందితుడికి గతంలో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని విచారణలో వెల్లడైనట్లు నార్సింగి ఎస్‌హెచ్‌వో హరికృష్ణ రెడ్డి తెలిపారు.

## బొంరాస్ పేటలో 6వ రోజుకు చేరిన వివోఏల సమ్మె

**బొంరాస్ పేట, మే 23 (జనం సాక్షి):** తమ డిమాండ్ల సాధన కోసం వివోఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం ఆరవ రోజు కొనసాగింది. సమ్మెకు మద్దతుగా ఏపీఎం బందేయ్య, సిసి యాదయ్య మద్దతు తెలిపారు. దఈ కార్యక్రమంలో వివోఏల మండల అధ్యక్షులు సూర్య నాయక్,రూప్లా నాయక్, దేవమ్మ, చరిత, మహాలక్ష్మి, రూప, నీలిమ, అనిత ,మంజుల, చంద్రకళ, అమృతమ్మ, రవి, నాగభూషణం, లాలప్ప, హనుమంతు, నరేష్ ,కృష్ణ, పాండు,తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ పని తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోరారు. బీజేపీ ఓటు చోరీ ద్వారా కుట్రలు చేస్తుందని, వాటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బీఎల్ఓలను తయారు చేసి ప్రతి అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎమ్మెల్యే శంకర్ జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ ప్రతిష్టను పెంచారని ప్రశంసించారు. నూతన అధ్యక్షులు పార్టీని మరింత బలోపేతం చేసి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీసీ అధ్యక్షులు నరసింహారెడ్డి కోరారు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించేది లేదు...

కాంట్రాక్టర్లు, సెంట్రింగ్ కార్మికులు శనివారం బైక్ ర్యాలీని నిర్వహించి ధర్నాలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు విశ్వనాథ్ యాదవ్, ప్రెసిడెంట్ రాము యాదవ్, జనరల్ సెక్రెటరీ సామ ఎల్లారెడ్డి తదితరులు మాట్లాడుతూ తమవి చాలా న్యాయమైన డిమాండ్లను, ప్రతిరోజు ప్రమాదాన్ని నెత్తిలో పెట్టుకొని దినదిన గండంగా కార్మిక పనులను వెల్లదీస్తున్నామని, తమ సమస్యలను ప్రభుత్వం, లేబర్ కమిషన్ అధికారులు పట్టించుకోని తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సెంట్రింగ్ రేటు అడుగుకు కనీసం 51 రూపాయి చెల్లించాలని, ప్రతి కార్మికుడికి విధిగా గుర్తింపు కార్డును అందజేసి వారికి ఈఎస్ఐ కార్డును అందించడంతోపాటు పిఎఫ్ సౌకర్యాన్ని సైతం ప్రభుత్వం చేపట్టాలని వారు స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ నుండి తాము సమ్మెను కొనసాగిస్తున్న ఇటు లేబర్ కమిషన్ అధికారులు, అటు ప్రభుత్వ పెద్దలు కనీసం పట్టించుకోకపోవడం వారి అహంభావానికి నిదర్శనంగా అభివర్ణించారు. ప్రతిరోజు ఉపాధి లేక తమ కుటుంబాలు పస్తుంటున్నాయని, ప్రభుత్వం బేషరతుగా దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను వారు ఎత్తి చూపారు. అవసరమైతే తమ ప్రాణాలను పణంగా పెట్టైనా మరో వారం రోజులపాటు సమ్మెలో పాల్గొంటామని, ఎట్టి పరిస్థితుల్లో తమ బ్రతుకు పోరాటాన్ని ఆపబోమని వారు ముక్తకంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సెంట్రింగ్ యూనియన్ కార్మికులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామనడం దురదృష్టకరం

**కడ్తాల్, మే 23 (జనంసాక్షి):** శనివారం మైసిగండిలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా దక్షిణ తెలంగాణ వెనుకబాటుకు గురైందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర తెలంగాణకు ప్రాధాన్యత ఇచ్చి దక్షిణాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. ఫార్మా సిటీ పేరుతో రైతుల నుంచి తక్కువ ధరకు భూములు స్వాధీనం చేసుకొని, ప్రపంచంలో నిషేధించబడిన ఫార్మా కంపెనీలను స్థాపించి ప్రాంతాన్ని కలుషితం చేయాలని చూశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జూన్ 2న ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు జరగనున్నాయని, ఫార్మా కంపెనీల ఆర్ అండ్ డి కేంద్రాలు, స్కిల్స్ యూనివర్సిటీ, ఎన్ఐయుఎం, సింగరేణి భవనాలు, డేటా సెంటర్లు వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టబోతున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం ద్వారా 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీపై ఆసక్తి పెరుగుతోందని, పెద్ద పెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని చెప్పారు. యువత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, విశ్వవిద్యాలయ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా వ్యవహరించనున్నారని తెలిపారు. హరీష్ రావు ఫ్యూచర్ సిటీని వ్యతిరేకించడం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నమని మండిపడ్డారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైసిగండి సర్పంచ్ జాటోవత్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరా సింగ్ నాయక్, అమర్ సింగ్, కిషన్ నాయక్, తుల్సి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వివోఏల సమ్మె 6వ రోజు

కొడంగల్, మే 23 (జనంసాక్షి): కొడంగల్ మండలంలో వివోఏల సమ్మె నేటికి 6వ రోజు కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో ఉషశ్రీ మేడంకి వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీవో ఉషశ్రీ మేడం సానుకూలంగా స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వివోఏలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని వివోఏల సమ్మెకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివోఏలకు గౌరవ వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023 అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి సీతక్క వివోఏల సమస్యలపై మాట్లాడిన విషయాన్ని గుర్తు చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మే 18 నుంచి కొనసాగుతున్న ఈ సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు, కొడంగల్ మండల వివోఏలు, స్థానికులు మద్దతు తెలిపారు. వివోఏలు తమ డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్, మే 23, జనంసాక్షి: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని ఎత్తుబార్ పల్లి గ్రామానికి చెందిన బుర్ర మల్లేష్ (31) శనివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై తన తల్లి బుర్ర బుగ్గమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.